# అపశ్రుతి




కె. సభా

నేనెంత చెప్పినా వినలేదు రామనాధం. "నువ్వు హరికథలు వ్రాసి ఉండవచ్చు. బుర్ర కథలూ రాసి వుండవచ్చు ఇలాంటి వెన్నో వినీ ఉండవచ్చు. ఈ హరి కథవంటి దీ లోకంలో ఇంతవరకూ విని ఉండవు" అన్నాడు.

అప్పటికే తొమ్మిది దాటింది. చలి ఎముకల్ని కొరికేస్తోంది. ఆరు బయట మంచులో ఎలా కూచోవడం! ఐనా తప్పలేదు. బయలుదేరాను.

"ఏమి కథ చెబుతున్నారీ రాత్రి" ప్రశ్నించాను.

"కాకాసురుని పునర్జన్మ వృత్తాంతం" అన్నాడు రామనాధం.

కాకాసురుడంటూ ఒక్కడున్నాడు మన పురాణాల్లో. వాడి పూర్వ జన్మ వృత్తాంతమే తెలీదు. పునర్జన్మ వృత్తాంత మేమిటి?

మన పురాణాల్లో కొన్నిటికి తలా తోకలు కనిపెట్టడం కష్టం. పూర్వగాధలహరిని వెదికితే ఏదైనా కన్పించవచ్చు. ఐనా ఏదో ఖర్మ ఈ మంచులో...

రామనాధందారిలోఆగి సిగరెట్లుకొన్నాడు. అతడు ఆత్మీయ మిత్రుడైనా సమయా సందర్భాలుండవు. ఎదో పాడు సినిమా కని పిడుగులా ఊడిపడి పీడిస్తాడు తీరా వెళ్ళడం తలనొప్పితో ఇంటి ముఖం పట్టడం మామూలే.

కథ ఎప్పుడో ఆరంభమైనట్టుంది. ఈ మధ్య ఆంధ్ర దేశంలో ఆడ వాళ్ల నవలల కెలా గిరాకీ తగిలిందో వాడి హరి కథకూ

అలాంటి బేరమే తగిలింది. అరడజన్ సినిమా పాటలుడజన్ డైలాగులతో మూడు ప్లాస్కుల కాఫీతో పద్మ వ్యూహం హరికథ అనాయాసంగా జరిగిపోతుంది. పొగిడింపులు చదివింపులు ఒన్సు మోర్లకు సగంకాలం ఐపోయింది. మగ వాళ్లైతే ఐదు ప్లాస్కులు. అంతే తేడా... సినిమా పాటలేని హరికథే ఉండదు.

"కోటి కరముల సాచి కొండంత యెత్తున
ఉప్పెన పల్లెల నూడ్చివైచె
వేలాదిగా ప్రజల్ వెల్లువలో మున్గి
జాడలేకనె పోయె శవములైన
లక్షల పశువులు నట్టేట గల్వగా
కోళ్ళను కుక్కలు కొల్లబోయె
పచ్చదనంబుల పంట పొలంబులు
నిలువెత్తు నీళ్ళలోనిలచి పోయె
తల్లి పిల్లల గోల్పోయి తల్లడిల్లె
పిల్ల తల్లిని విడనాడి జేలయయ్యె
గ్రామ సీమలు చెడివల్ల కాడులయ్యె
ప్రళయ మేతెంచి........."

ఆ చివరి పదం సరిగ్గ విన్పించలేదు. ప్రేక్షకులు నిశ్శబ్దంగా వింటూ ఉన్నారు. కథకు సంబంధంలేక పోయినా ఈ మహాతల్లి జలప్రళయంలో భీభత్సాలను వివరించి వారిపట్ల ప్రజల్లో సానుభూతి కలిస్తున్నదేమో అనుకొన్నాను. మరో పది నిమిషాలు గడిచాక గానీ అసలు కథేయిదని తెలుసుకో లేక పోయాను.

కథ ప్రశాంతంగా సాగుతూనే ఉంది. "ఆ తరుణంబున తెలుగు తల్లి శోకంబునుం గాంచి పరితప్త హృదయంబుల నానా దేశాధీశులు తమకు తోచిన ధనధాన్య వస్తువాహనంబులను సమర్పించు తెంఅంగెద్దియనిన..."

"జపాను జర్మని పాకిస్తాను
సాను భూతితో పంపె..."

ఏఏ దేశాలు ఏవేవి ఎంతెంత పంపాయో వివరాలచ్చే ఆ పాట పూర్తికాగానే చెంగున గంతులు వేస్తూ చిరుతల్ని విదిలిస్తూ ఫిడేలు వైపు దృష్టిని సారిస్తూ మృదంగంతో సవాలు చేస్తూ అందుకొన్నది గదా!

"తెలుగు నేలపై
కాకాసురుడు
తిరిగి పుట్టినాడు
నలిగి నట్టి తెలు
గోడి గుండెలను
నంజుక తిన్నాడు
........."

శ్రీమద్రమా రమణ గోవిందా......గోవింద
శ్రీఆంజనేయ వరద గోవిందా ...గోవిందా
నమః పార్వతీ పతే...హరహర మహదేవ.

మంచు కురుస్తున్నా మనుషులు కదలడం లేదు. చలి వేస్తున్నా జనస్తోమం తగ్గనేలేదు, రామనాధం సిగిరెట్టు మీద సిగరెట్టు ఊది పారేస్తున్నాడు.

ఆ చం దా ళు రె వ ర య్యా అంటే...

"బాధితుల కిచ్చు బియ్యము పప్పులందు
ఆర్తులకు అందచేసెడు అప్పులందు
లంచములు దీయుచున్నట్టి వంచగాళ్ళు
కాష్టముల పిండముల దినుకాకులౌర
పలుగాకులౌర"

"కావున ఓ పరమ భక్తాగ్రేసరులారా! పూర్వము కాకాసురుని సంతతికించెందిన ఈ రాక్షసులు పునర్జన్మంబున మన కర్మవశాత్తున ప్రళయోద్భూతులై స్వైర విహారముల సల్పుచున్నవారలు..."

కథ దాదాపు ముగింపునకే వచ్చింది.

నా కెంతో ఆశ్చర్యం వేసింది. కాకాసురుడు రాక్షసుడే, కానీ వాడు చేసిన అపకారం అపచారం బహు స్వల్పమైంది. జల ప్రళయంలో సమాధి గతులై ఆ కుటుంబాలలో హత భాగ్యులైన వారికి అందే సొమ్మును కాజేసేవారు కాకాసురు లనడంలో ఔచిత్యం లేదు. కుటుంబనియంత్రణం పాటించక పోయినా కాకాసురుని సంతతి యింతగా పెరగదు. ఇది వాడి పునర్జన్మ వృత్తాంతం కాదు. అసురులతో వీళ్ళను పోల్చడం పాడి కాదు. వారు మనుష్యుల్ని ఒక్కసారిగా తినేశారు. వీళ్ళట్లా కాదు కొద్ది కొద్దిగా నంజు కొంటున్నారు. నమలి నమలి తింటు న్నారు. వీరిని పోల్చదగిన వారు ప్రాచీన సాకాత్యంలో ఎవ్వరూ కనిపించరు. ఆధునిక ప్రపంచ చరిత్రలోనూ కాగడా పెట్టి గాలిం చినా లేరు.

హరికథ పూర్తి కావడంతో అందరూ పైకి లేచారు.

"ఎలా ఉంది కథ?అన్నాడు రామనాధం.

"కథ బాగుంది కానీ పేరు బావులేద న్నాను.

"ఏపేరైతే సరి పోతుందంటావ్?" ప్రశ్నించాడు.

నేను సమాధానం చెప్పలేదు. ఇప్పుడే గాదు ఎప్పుడూ చెప్పలేనని నాకు తెలుసు.

"రాబందులంటే?" ప్రశ్నించాడు మళ్ళీ రామనాధం.

"అవి చచ్చినవాడి శవాన్నే పీక్కుతింటాయి వీళ్ళట్లు కాదు బ్రతికిన వాడికండల్ని గుండెల్ని చీల్చేస్తారు." అన్నాను.

అతడు మాట్లాడలేదు.

నేనూ మాట్లాడలేదు.

కొంతదూరంనడిచాక అతడన్నాడుగదా.
"అజ్ఞానులు...ఏం చేద్దాం..."

"అక్షరాస్యులే... విద్యావంతులుకదా" అన్నాను.

ఆ రాత్రి పడుకొన్నాను. నిద్ర నా జోలికే రాలేదు......


ప్రజాతంత్రలో ప్రకటనలు

మీ వ్యాపారాభివృద్ధికి

దోహదం చేస్తాయి